# రోడ్డే ఆవాసం..చెత్తే ఆహారం

- రోడ్లపైనే పశువులు, కుక్కల స్వైర విహారం
- కోతుల సంచారం
- పట్టించుకోని యజమానులు, అధికారులు
- ఇబ్బందులకు గురవుతున్న ప్రజానీకం



మండలకేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో రోడ్డుపైనే ఉన్న పశువులు

సిర్పూర్(టీ), మార్చి 9 : మూగజీవాలకు రోడ్డే ఆవాసమైంది. రోడ్డుమీద చెత్తే ఆహారంగా మారింది..అడవుల్లో ఉండాల్సిన కోతులు జనావాసాల్లోకి వచ్చాయి.. ఒక పక్క పందులు, మరో పక్క వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. మండలకేంద్రంలో ఎక్కడ చూసినా ఆవులు, పందులు, కుక్కలు, కోతులు దర్శనమిస్తున్నాయి. ప్రతి క్షణం మూగ జీవాలు ఆహారం కోసం పరితపిస్తూ అనేక పాట్లు పడుతున్నాయి. అవసరం వచ్చినపుడు అమ్ముకోవడం, సొమ్ము చేసుకోవడం తప్ప వాటి ఆలనా పాలనా చూడడంలో యజమానులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో ప్రస్తుతం ఎక్కడా చూసినా ఆవులు, ఎడ్లు రోడ్లపై తిరుగుతున్నాయి. సిర్పూర్(టీ)– కౌటాల, సిర్పూర్(టీ)– కాగజ్‌నగర్ ప్రధాన రహదారితో పాటు పల్లె ప్రాంతాల్లోనూ రాత్రింబవళ్లు తేడా లేకుండా రోడ్లపైనే తిష్ట వేస్తున్నాయి. దీంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. మూగజీవాలు సైతం వాహనాలు ఢీకొని మృత్యువాత పడుతున్నాయి. ఇంత జరుగుతున్నా పశు యజమానులు, సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆహారం లేక చెత్తా చెదారంతో పాటు ప్లాస్టిక్ కవర్లు తింటూ పశువులు రోగాల బారిన పడి మృతి చెందుతున్నాయి.



రోడ్డుపైనే కుక్కలు

### పందులు, కుక్కల స్వైర విహారం

మండలకేంద్రంలోని ప్రధాన రహదారులతో పాటు పలు కాలనీల్లో పందులు, కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. పందులు, కుక్కలు ఎటువైపు నుంచి వస్తాయో తెలియని పరిస్థితి నెలకొంది. అవి నేరుగా వచ్చి వాహనాదారులను ఢీ కొట్టిన ఘటనలు చాలానే ఉన్నాయి. వీటి సంఖ్య రోజురోజుకీ పెరుగుతున్నది తప్ప తగ్గడం లేదు. గుంపులు, గుంపులుగా చేరి రోడ్డుపై వెళ్లేవారిపై దాడి చేస్తున్నాయి. ఇటీవల వేంపల్లి గ్రామంలో ఓ యువతిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. పందులు జనావాసాల్లోకి వెళ్లి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. వాటి వలన అనేక రోగాలు వచ్చే ప్రమాదం ఉంది. కోతులు కుడా జనావాసాల్లోకి వచ్చి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. ఆయా కాలనీల్లో ఇండ్లలోకి చేరి ఇంట్లో ఏమున్నా ఎత్తుకెళ్తున్నాయి. ఇంటి పైకప్పు తీసి మరీ ఇంట్లో ఉన్న బియ్యం, కూరగాయలు , పప్పులు ఇలా ఏది దొరికితే అది తీసుకెళ్తూ ఆర్థిక కష్టాలను తీసుకొస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పశువులు, ఆవులు, కుక్కలు, పందులు, కోతులు వీధుల్లో తిరుగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

### కోతుల బెడద నివారించాలి



మండలకేంద్రంలో కోతుల బెడద తీవ్రంగా ఉంది. వాటికి ఆహారం దొరక్క పోవడంతో జనావాసాల్లోకి వచ్చి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. ఇంట్లోకి దూరి ఏముంటే అది తీసుకెళ్లి భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. వాటి బాధ పడలేక రైతులు పండ్లు, కూరగాయలు పండించడం మానేశారు. కొందరైతే ఇంట్లో ఉన్న చెట్లను నరికేసుకుంటున్నారు. సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించి కోతులను జనావాసాల నుంచి అటవీ ప్రాంతాలకు తరలించాలి.

-లాయక్ అహ్మద్- సిర్పూర్(టీ)

### గోశాలకు అప్పగించాలి



పశువులను రోడ్లపై వదిలేసిన యజమానులపై అధికారులు చర్యలు తీసుకోవాలి. మండల వ్యాప్తంగా ఆకలితో తిరుగుతున్న పశువులన్నీటిని వాటి యజమానులకు అప్పగించాలి. గోశాలకు తరలించాలి. రోడ్లపై తిరుగుతున్న పశువులను పట్టుకుని వేలం నిర్వహించాలి.

-మకోడే రాకేశ్, సిర్పూర్(టీ)

### అధికారులు స్పందించాలి..



పందుల సంచారం పెరగడంతో దుర్గంధం వ్యాపించి ఇంటి నుంచి బయటకు రావడానికి ఇబ్బందిగా ఉంది. ఇంటి గేటు తీసుంటే చాలు పందులు లోపలికొచ్చి మొక్కలు, సామగ్రిని ధ్వంసం చేస్తూ, నానా భీభత్సం చేస్తున్నాయి, అధికారులు స్పందించి పట్టణంలో పందుల బెడద లేకుండా చర్యలు చేపట్టాలి.

-ఫారుక్- సిర్పూర్(టీ)

# ముక్కు మూసుకోవాల్సిందే..

- గౌతమ బుద్ధ చెరువులో చికెన్ వ్యర్థాలు
- పట్టించుకోని అధికారులు
- రోగాల పాలవుతున్న స్థానికులు



మండలకేంద్రంలోని గౌతమ బుద్ధ చెరువులో చికెన్ వ్యర్థాలు

సిర్పూర్(టీ), మార్చి 9 : మండలకేంద్రంలోని గౌతమ బుద్ధ (నాగమ్మ చెరువు) చికెన్ వ్యర్థాలతో దుర్గంధం వెదజల్లుతోంది. నాగమ్మ చెరువులో ఎటు చూసినా చికెన్ వ్యర్థాలు పడి ఉండడంతో చెరువు కంపుకొడుతున్నది. నాగమ్మ చెరువులో మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప తథాగత గౌతమ బుద్ధుడి విగ్రహం ఏర్పాటు చేయడంతో పర్యాటకంగా ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్నది. చెరువులో చేప పిల్లలు సైతం ఉండడంతో వ్యర్థాల వలన మరణించే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా సంబంధిత శాఖాధికారులు పట్టించుకోవాలని పర్యాటకులు, ప్రజలు కోరుతున్నారు.


**ప్రకటన**

ఇందుమూలముగా సమస్త ప్రజానికానికి తెలియజేయునది ఏమనగా, UPPARI MALLESH, S/o. VENKAIAH, Age: 47, Occ: Business, H.No. 1-13-307/B, R.R. CAMP KAGHAZNAGAR రిజిస్ట్రేషను జిల్లా ఆదిలాబాద్ సబ్ జిల్లా ఆసిఫాబాద్ జిల్లా మరియు జిల్లా పరిషత్ ఆదిలాబాద్ రెవెన్యూ మండలం కాగజ్‌నగర్ మున్సిపాలిటి కాగజ్‌నగర్ గ్రామము కొత్తపేట (కాగజ్‌నగర్) వార్డు నెంబరు 13కు చెందిన నివాస స్థలము సర్వే నంబరు 18/అ ప్లాట్ నెంబరు 100 ఖాళి ప్లాటు విస్తీర్ణము 20x60= 1200 చదరపు ఫీట్లు సమానముగా 133.33 చదరపు గజములు లేక 111.47 చదరపు మీటర్లు అగును. ఈ ప్లాటు సమీప ఇంటి నెంబర్ 1-13-201 కలదు. లో కల ఈ హద్దులు.

తూర్పు : 20 ఫీట్ల రోడ్డు
పడమర : ప్లాట్ నెంబర్ 101
ఉత్తరం : ప్లాట్ నెంబర్ 19
దక్షిణం : తిరుపతి గౌడు గారి ఇల్లు H.No. 1-13-201

కల దానిని యజమాని అయి ఉండి సంపూర్ణ స్వాదీనములో ఉండి నాక్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ బ్రాంచ్ సిర్పూర్ కాగజ్‌నగర్ వారి వద్ద తనఖా పెట్టుచున్నారు. కావున ఎవరికైనా ఎలాంటి హక్కులు కానీ ఆక్షేపణలు కానీ ఉన్న యెడల ఈ ప్రకటన వెలువడిన (7) రోజుల లోపల ఈ క్రింది చిరునామాకు తెలియజేయగలరు.

ఇట్లు: Sd/- పిన్నింటి అశోక్, అడ్వకేట్,
ఇ.నెం.3-7-852/1.వావిలాలపల్లి,కరీంనగర్ సెల్: 9849331558

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

★త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-311806-All

★ఇంటర్, డిగ్రీ చదివి ఖాళీగా ఉన్న వారికి కంప్యూటర్ & ఇంగ్లీష్ కోర్సులు నేర్పి, కార్పొరేట్ సంస్థలలో ఉద్యోగ అవకాశాలు చూపించబడును. 7997997364/5.
NT-327958-All

**కోర్టు కేసులు**

★మీరు మీ కోర్టు కేసులతో బాధ పడుతున్నారా? NOC ఇబ్బందులు ఉన్నాయా? ఎంత క్లిష్టమైన కేసులైనా తక్కువ Feesతో నమ్మకమైన లాయర్‌తో Solve చేస్తాం. GLS, L.B.నగర్, Hyd. 7893011777.
NT-311861-All

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677


# ఘనంగా మహాశివరాత్రి వేడుకలు

- భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు
- ఉపవాస దీక్షల విరమణ
- రెండో రోజూ దైవ దర్శనానికి బారులు
- అన్నప్రసాద వితరణ చేసిన ఆలయాల కమిటీల సభ్యులు
- బందోబస్తు చేపట్టిన పోలీసులు, వలంటీర్లు



ఆసిఫాబాద్ టౌన్: సందీప్‌నగర్ శివాలయంలో అన్నదానం చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



దహెగాం: బోనాలు సమర్పిస్తున్న భక్తులు

ఆసిఫాబాద్ టౌన్, మార్చి 9: జిల్లా కేంద్రంలోని సందీప్‌నగర్ శివాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం అన్నదానం నిర్వహించారు. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఉపవాస దీక్షలు చేసిన భక్తులకు శనివారం అన్న ప్రసాదం ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు రామగిరి అశోక్ తెలిపారు. ఇక్కడ కమిటీ సభ్యులు రాపర్తి కార్తీక్, రాపర్తి శంకర్, అక్కు విజయ్ కుమార్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చిలివేరు వెంకన్న, గంధం శ్రీనివాస్, భక్తులు పాల్గొన్నారు.

### వేంకటేశ్వరస్వామి ఆలయంలో..

కెరమెరి, మార్చి 9: మండల కేంద్రంలోని నెహ్రూనగర్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం అన్నదానం ఏర్పాటు చేశారు. మహాశివరాత్రి సందర్భంగా భక్తులు ఉపవాసాలు ఉంటూ రాత్రంతా భజన, కీర్తనలు చేస్తూ దేవున్ని స్మరించుకున్నారు. ఉదయం స్నానాలు ఆచరించిన అనంతరం శివాలయంతో పాటు వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, నైవేద్యం సమర్పించారు. అనంతరం ఆలయ కమిటీ ఏర్పాటు చేసిన అన్నదానంలో పాల్గొన్నారు.

### భక్తులకు భద్రకాళి దివ్యదర్శనం

పెంచికల్‌పేట్, మార్చి 9: మండల కేంద్రంలోని పెద్దవాగు ఒడ్డు సమీపాన పంచకళాపుర క్షేత్రంలో వెలసిన భద్రకాళి సమేత వీరభద్ర స్వామి ఆలయంలో శివరాత్రి సందర్భంగా రెండోరోజు భద్రకాళి అమ్మవారు భక్తులకు దివ్యదర్శనిమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు మూలమఠం శివప్రసాద్‌స్వామి ఆధ్వర్యంలో భద్రకాళి, వీరభద్ర స్వామికి అంగరంగ వైభవంగా కల్యాణం జరిపించారు. భక్తులు అమ్మవారికి ఒడి బియ్యం, ముడుపులతో మొక్కులు చెల్లించారు. భక్తులకు రేణిగుంట్ల సంతోష్, ధనలక్ష్మి ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. ఎస్ఐ కొమురయ్య ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

### కౌటాలలో కల్యాణం

కౌటాల, మార్చి 9: మండల కేంద్రంలోని సదాశివపేట శివాలయ క్షేత్రంలో శుక్రవారం రాత్రి ఆలయ ప్రధాన అర్చకులు అంబేద శంకరయ్య, సంతోష్ ఆధ్వర్యంలో శివ పార్వతుల కల్యాణం అంగరంగా వైభవంగా నిర్వహించారు. స్వయంభూ వెలసిన కంకాలమ్మ గుట్టపై ఆలయ కమిటీ చైర్మన్ సులువ కనకయ్య ఆధ్వర్యంలో హోమం, శివపార్వతుల కల్యాణం, రామాలయంలో హోమం, కల్యాణం, తాటిపల్లి కుర్తా వద్ద గల వార్దా నదిలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించి హనుమాన్ ఆలయంలో పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ దత్తు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. తాటిపల్లి వార్దా నదిలో పుణ్య స్నానాలు ఆచరించేందుకు భక్తులు ఎడ్ల బండ్లపై తరలి వెళ్లారు. కౌటాల ఎస్ఐ మధుకర్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

### లగ్గాంలో బోనాలు

దహెగాం, మార్చి9: లగ్గాం ఉమాచంద్రశేఖరస్వామి ఆలయంలో శనివారం బోనాల వేడుకలు నిర్వహించారు. భక్తులు భాజాభజంత్రీలతో ఆలయ పూజారి శ్రీకాంతాచారి ఆధ్వర్యంలో శివపార్వతులకు బోనాలు సమర్పించారు. శివరాత్రి మరుసటి రోజు బోనాల వేడుకలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది.

### శివాలయాలకు పోటెత్తిన భక్తులు

చింతలమానేపల్లి, మార్చి 9 : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉపవాస దీక్షలు చేపట్టిన భక్తులు శనివారం ఆలయాల వద్ద మొక్కులు తీర్చుకునేందుకు బారులు తీరారు. కర్జెల్లి ముసలమ్మ గుట్ట శివాలయంతో పాటు ఆయా ఆలయాల్లో కమిటీ సభ్యులు అన్నదానం చేశారు.

### ముగిసిన ఈస్‌గాం శివమల్లన్న జాతర

కాగజ్‌నగర్ టౌన్, మార్చి 9 : ఈస్‌గాం శివమల్లన్న ఆలయంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 7 నుంచి 9 వరకు నిర్వహించిన ఈస్‌గాం శివమల్లన్న జాతర శనివారం ముగిసింది. ఉదయం ఆలయంలో సుప్రభాతం, రుద్రాభిషేకం, అర్చనలు, అభిషేకాలు, మహాహారతి, ద్వారబంధనం కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని వల్లు బండపై నాణేలను నిలిపి కోరికలు నెరవేరి ఇంటిల్లిపాదీ సుఖసంతోషాలతో ఉండాలని భక్తులు కోరుకున్నారు. ఆలయ ఈవో వేణుగోపాల్ గుప్తా, ఉత్సవ కమిటీ చైర్మన్ మురళీధర్ ఆధ్వర్యంలో భక్తులకు సౌకర్యాలు కల్పించారు. ఎస్పీ సురేశ్‌కుమార్ ఆధ్వర్యంలో కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్, రూరల్ సీఐలు నాగరాజు, సాధిక్ పాషా, ఎస్ఐలు రామన్‌కుమార్, సనత్‌రెడ్డి, రమేశ్ బందోబస్తు చేపట్టారు.

### ఆలయాల్లో ప్రత్యేక పూజలు

బెజ్జూర్, మార్చి 9 : మండల కేంద్రంలోని శివాలయంతో పాటు రగనాయక, బ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో భక్తులు అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. బీజేపీ నాయకులు అరటిపండ్లు పంపిణీ చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మహేశ్ అన్ని వసతులు ఏర్పాటు చేశారు. కమిటీ సభ్యులు సబ్ కమిటీలుగా ఏర్పడి వలంటీర్లుగా విధులు నిర్వహించారు.



కాగజ్‌నగర్ టౌన్: ఈస్‌గాం ఆలయంలో కొబ్బరి కాయలు కొడుతున్న భక్తులు



బెజ్జూర్: ఆలయ ప్రాంగణంలో దుకాణాల వద్ద భక్తుల సందడి



చింతలమానేపల్లి : మొక్కులు తీర్చుకునేందుకు బారులు తీరిన భక్తులు

# పట్టుదలతో చదవి లక్ష్యాన్ని చేరుకోవాలి



కేజీబీవీలో అదనపు గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు, జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు

కాగజ్‌నగర్ టౌన్, మార్చి 9 : విద్యార్థులు పట్టుదలతో చదువుకుని లక్ష్యాన్ని చేరుకోవాలని సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు సూచించారు. శనివారం పట్టణంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో అదనపు గదులు, ల్యాబొరేటరీ నిర్మాణాలకు జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావుతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇంటర్, పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు భయం వీడి శ్రద్ధగా చదువుకోవాలని సూచించారు. పాఠశాలలో రూ. 2.30 కోట్లతో అదనపు గదులు, ల్యాబ్ నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. పాఠశాలలో డ్రైనేజీ, టాయిలెంట్ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. జడ్పీ చైర్మన్ మాట్లాడుతూ విద్యార్థులు చదువే దైవంగా భావించి ముందుకెళ్లాలని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సాహిన్ సుల్తానా, వైస్‌చైర్మన్ రాజేందర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, అసెంబ్లీ కన్వీనర్ గొల్లపెలి వీరభద్రాచారి, జిల్లా కోశాధికారి అరుణ్‌లోయా, పట్టణాధ్యక్షుడు సిందం శ్రీనివాస్, దెబ్బటి శ్రీనివాస్, శ్రీదేవి, కౌన్సిలర్లు జైచందర్, ఎల్లేశ్, మహిళా అధ్యక్షురాలు మౌనిక, నాయకులు రాణి, రమేశ్, దీపక్, తిరుపతి, సంతోష్, కేజీబీవీ ఎస్‌వో రమాదేవి, ఉపాధ్యాయులు జ్యోతి, నిర్మల, స్వాతి, ప్రసన్న, సీఆర్టీలు పాల్గొన్నారు.

### 11, 12న రైల్వే గేట్ మూసివేత

రెబ్బెన, మార్చి 9: మండల కేంద్రంలోని గంగాపూర్ రైల్వే గేట్ ఈ నెల 11, 12 తేదీల్లో మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మూడోలైన్ పనులు కొనసాగుతుండడంతో గేట్ మూసి ఉంటుందన్నారు. గేట్ ద్వారా వెళ్లే ప్రజలు ఇతర మార్గాల ద్వారా రాకపోకలు సాగించి సహకరించాలని కోరారు.

### ప్రజాపాలన సేవాకేంద్రం

కౌటాల, మార్చి 9: ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాపాలన సేవా కేంద్రం ఏర్పాటు చేసినట్లు కౌటాల పంచాయతీ కార్యదర్శి సాయికృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాపాలన దరఖాస్తుల విషయంలో ఎలాంటి సమస్యలున్నా పరిష్కరించడానికి ఈ సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### నేడు విద్యుత్ అంతరాయం

కౌటాల, మార్చి 9: మండల కేంద్రంలోని సబ్ స్టేషన్ పరిధి విజయనగరం ఫీడర్, గుండాయిపేట సబ్ స్టేషన్ పరిధి గుడ్లబోరి ఫీడర్‌లో విద్యుత్ మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రవీందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

# టీయూటీఎఫ్ కార్యవర్గం ఎన్నిక




టీయూటీఎఫ్ నూతన కార్యవర్గంతో జిల్లా అధ్యక్షుడు శాంతికుమార్

పెంచికల్ పేట్, మార్చి 9: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం టీయూటీఎఫ్ మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు శాంతికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో 317 రద్దుచేసి జిల్లాలో నియమితులైన వేరే జిల్లాల ఉపాధ్యాయులను సొంత జిల్లాలకు పంపి ప్రమోషన్లు ఇచ్చిన తర్వాతనే ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అధ్యక్షులుగా శ్రీధర్, అశోక్‌చందర్, సహాధ్యక్షులుగా తిరుమలగౌడ్, సుజాత, ప్రధాన కార్యదర్శిగా అప్పాజీ గణేశ్, కోశాధికారిగా లక్ష్మీనారాయణ ఎన్నికయ్యారు. ఇక్కడ జిల్లా సహాధ్యక్షుడు భానుప్రకాశ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

### నేడు సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష

ఆసిఫాబాద్ టౌన్, మార్చి 9: సాంఘిక సంక్షేమ గురుకులాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రుక్మాపూర్ సైనిక్ స్కూల్(సీబీఎస్‌ఈ)లో ఆరోతరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ప్రవేశాల కోసం ఆదివారం నిర్వహించనున్న సైనిక్ స్కూల్ సెట్–2024 కోసం ఏర్పాట్లు పూర్తి చేసినట్లు స్థానిక సాంఘిక సంక్షేమ గురుకులం ప్రిన్సిపాల్ (సెంటర్ చీఫ్ సూపరింటెండెంట్) శ్రీనాథ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కుమ్రం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో ఈ సైనిక్ స్కూల్ సెట్ కోసం సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల/ కళాశాల ఆసిఫాబాద్‌లో మాత్రమే ఉందని వెల్లడించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగనున్న ఈ పరీక్ష కోసం విద్యార్థులు పరీక్షా కేంద్రానికి గంట ముందుగా చేరుకోవాలని సూచించారు.

### ఖాతాలను ఆధార్‌తో అనుసంధానించాలి

ఆసిఫాబాద్ టౌన్, మార్చి 9: జిల్లాలోని సీసీఐకి పత్తి విక్రయించిన రైతులు తమ బ్యాంక్, ఇండియా పోస్ట్ బ్యాంక్ ఖాతాలకు ఆధార్ కార్డుతో అనుసంధానించుకోవాలని జిల్లా మార్కెటింగ్ అధికారి గజానంద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు తమ బ్యాంకు ఖాతా ఆధార్ తో అనుసంధానం కానిపక్షంలో పత్తి అమ్మిన డబ్బులు జమ కావన్నారు. ఇప్పటికే పత్తి అమ్మి డబ్బులు జమ కాని రైతులు తక్షణమే ఇండియా పోస్ట్ బ్యాంక్ అయితే తమ పాన్ , ఆధార్ కార్డు తీసుకుని సమీపంలోని పోస్ట్ ఆఫీస్‌లో సేవింగ్ ఖాతాగా మార్చుతూ క్రెడిట్ లిమిట్ పెంచినట్లు పోస్ట్ మాస్టర్ తో ధ్రువీకరించి నకలు ప్రతిని వ్యవసాయ మార్కెట్ కమిటీలో అందజేయాలని పేర్కొన్నారు. బ్యాంకు ఖాతా యాక్టివ్ చేసుకొనుటకు, తమ పేరిట గల ఇతర బ్యాంకు ఖాతాను ఆధార్‌తో అనుసంధానం చేసుకొనుటకు సంబంధిత బ్యాంకు కు వెళ్లి ఈకేవైసీ చేయిస్తే, ఖాతాలో పత్తి కొనుగోలు డబ్బులు జమ అవుతయాయని వెల్లడించారు. మరిన్ని వివరాలకు ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీ– 7330733437, 8688886142, కాగజ్‌నగర్ మార్కెట్ కమిటీ – 7330733462 సెల్ నంబర్లలో సంప్రదించవచ్చని సూచించారు.